సాక్షి విశాఖపట్నం

సోమవారం ၊ 21 ၊ జూలై ၊ 2025



దేవుడా.. బతికించు.. 8లో



7 నుంచి శ్రీమన్నారాయణ యాగం 8లో



గాయత్రీనగర్‌లో డయేరియా విజృంభణ 8లో

రేపు మధ్యాహ్నం 2.30 గంటల వరకే అప్పన్న దర్శనాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల వరకు మాత్రమే లభిస్తాయని సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరి గ్రామదేవతలు పాదాలమ్మ, బంగారమ్మ పండుగ సందర్భంగా ఈ మార్పు చేసినట్టు పేర్కొన్నారు. తిరిగి బుధవారం ఉదయం 6.30 గంటల నుంచి యథావిధిగా స్వామి వారి దర్శనాలు లభిస్తాయని వెల్లడించారు. భక్తులంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

అలల ఆలింగనం



సముద్రం... అదొక అనంత సౌందర్యం.. ఎంత చూసినా తనివి తీరని అద్భుతం. ఆదివారం ఆర్కే బీచ్‌లో అడుగుపెట్టగానే, అలల సవ్వడి సరికొత్త రాగాన్ని పలికింది. ఆ మనోహర దృశ్యం పర్యాటకుల మనసులను మైమరపించింది. పరుగెత్తుకుంటూ వచ్చిన తెల్లటి నురుగుల అలలు, పాల మీగడలా పాదాలను తాకుతుంటే, ఆ పులకింత వర్ణనాతీతం. ప్రశాంతమైన ఆ క్షణాల్లో సిటిజనులు ఆహ్లాదంగా గడిపారు. అలల చెంత నిలబడి సెల్ఫీలు తీసుకుంటూ, ఆ మధురానుభూతులను తమ కెమెరాలలో బంధించుకున్నారు. ప్రతి అల ఒక కొత్త ఆనందాన్ని మోసుకొచ్చింది. ప్రతి క్షణం ఒక మధుర జ్ఞాపకంగా మారింది. ఆర్కే బీచ్‌లో ఆ ఆదివారం సముద్రంతో మమేకమైన అనుభూతి... నిజంగానే మధురాతి మధురం!

-ఫొటో :సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

చిరుజల్లులతో ఆహ్లాదం



నగరంలో ఆదివారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి, ఆహ్లాదకరంగా మారింది. ఉక్కపోతతో అల్లాడిన నగర ప్రజలకు ఈ జల్లులు కాస్త ఉపశమనాన్ని కలిగించాయి. రోజంతా మేఘావృతమై ఉన్న ఆకాశం, సాయంత్రానికి జల్లులతో పలకరించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

-ఫొటో :సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పేదోడిపై బంగారు కత్తి!



నిరుపేదలను సంపన్నులుగా మారుస్తామంటూ సర్వే

ఇప్పటికే జిల్లాలో 73,949 పేద కుటుంబాలున్నట్లు గుర్తించిన కూటమి ప్రభుత్వం

- ఈ కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మారుస్తామని హామీ
- అయినా వారి జీవితాలకు వెలుగు చూపని సర్కారు
- వారంతా పేదవాళ్లా కాదా అని మరోసారి రీసర్వే పేరుతో కాలయాపన
- 12 వేల మంది మార్గదర్శుల్ని గుర్తించినా.. స్పందన శూన్యం

సాక్షి, విశాఖపట్నం: పీ–4 విధానంతో సమాజంలో అట్టడుగున ఉన్న పేద కుటుంబాల్ని ఆర్థికంగా పైకి తీసుకొచ్చి..బంగారు కుటుంబాలుగా మార్చుతామంటూ బీరాలు పలుకుతున్న కూటమి ప్రభుత్వం.. కాలయాపన చేస్తోంది. ఇప్పటికే పలు దఫాలుగా సర్వేలు నిర్వహించి.. కొన్ని కుటుంబాల్ని గుర్తించగా.. మళ్లీ అందులో వడపోత కోసమో.. ఏమో.. రీసర్వే పేరుతో పేదోడి ఇంటిపై 'బంగారు' కత్తి వేలాడదీస్తోంది. ఉగాది నాటికి ఆ కుటుంబాల్లో వెలుగులు నింపుతామంటూ చంద్రబాబు బాకాలు కొట్టారు. ఉగాది వెళ్లి.. మూడు నెలలు గడిచినా.. ఆ ఇళ్లల్లో కొత్త వెలుగులేమీ కనిపించడం లేదు. పేదల్ని ఆదుకునేందుకు మార్గదర్శులు రావాలంటూ ప్రభుత్వం పిలుపునిస్తున్నా.. సర్కారుపై నమ్మకం లేని సంపన్నులు.. మొహం చాటేస్తున్నారు. దీంతో.. అధికారులే మార్గదర్శులుగా మారాలనీ.. లేదంటే.. దత్తత తీసుకునే సంపన్నుల్ని వెతకాలంటూ ప్రభుత్వం హుకుం జారీ చెయ్యడంతో.. జిల్లా యంత్రాంగం మల్లగుల్లాలు పడుతోంది. ఉగాది నాటికి ఈ కుటుంబాలకు వెలుగులు నింపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించినప్పటికీ, ఉగాది వెళ్లి మూడు నెలలు గడిచినా ఆ ఇళ్లలో కొత్త వెలుగులు కనిపించడం లేదని తెలుస్తోంది. పేదలను ఆదుకునేందుకు 'మార్గదర్శులు' (సంపన్న వర్గాలు) ముందుకు రావాలని ప్రభుత్వం పిలుపునిస్తున్నా, ప్రభుత్వ వైఖరిపై నమ్మకం లేని సంపన్నులు ముందుకు రావడం లేదన్న ఆరోపణలు న్నాయి. దీంతో అధికారులే మార్గదర్శులుగా మారాలని లేదా దత్తత తీసుకునే సంపన్నులను వెతకాలని ప్రభుత్వం ఆదేశించడంతో జిల్లా యంత్రాంగం సందిగ్ధంలో పడింది.

అమలులో కొరవడిన చిత్తశుద్ధి

పీ–4 విధానం ద్వారా సమాజంలోని అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలకు మొదటి 20 శాతం సంపన్న కుటుంబాలు సాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేసింది. మంత్రులు, అధికారులు ప్రతి వారం సమీక్షలు నిర్వహిస్తూ హడావిడి చేసినప్పటికీ, ఆచరణలో చిత్తశుద్ధి కొరవడిందని స్పష్టమవుతోంది. సచివాలయాల వారీగా సర్వేలు కూడా నిర్వహించి, జిల్లాలో మొత్తం 73,452 'బంగారు కుటుంబాలను' గుర్తించారు. వీరికి సంపన్నుల నుంచి సాయం అందించే ప్రక్రియ ప్రారంభిస్తామని నెల రోజుల క్రితం మంత్రులు, అధికారులు ప్రకటించారు. అయితే, ఇప్పటివరకు ఒక్క కుటుంబానికి కూడా చిన్న సాయం కూడా అందలేదని సమాచారం.

'మార్గదర్శులు' దొరకని వైనం

బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు 'మార్గదర్శులుగా' సంపన్నులను గుర్తించే బాధ్యతను కూడా ప్రభుత్వం జిల్లా అధికారులకే అప్పగించింది. జిల్లాలో ఇప్పటివరకు 12 వేల మంది మార్గదర్శులను (సంపన్నులు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు) గుర్తించి వారి వివరాలను 'రూట్స్ యాప్'లో నమోదు చేశారు. ప్రతి మార్గదర్శితో సంప్రదింపులు జరిపే కార్యక్రమాన్ని కూడా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టారు. కానీ, సంపన్నుల నుంచి ఎలాంటి స్పందనా రావడం లేదని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు, ఉద్యోగులపై భారం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను చూసి, కొందరు మార్గదర్శులుగా సాయం అందించేందుకు వెనుకాడుతున్నారు. మార్గదర్శులుగా ఉండకపోతే ప్రభుత్వం తమపై రాజకీయ కక్షలకు పాల్పడుతుందేమో నన్న ఆందోళన మరికొందరిలో ఉంది. ఈ మీమాంస కారణంగా 'బంగారు లక్ష్యం' అడుగు పడటం లేదు. దీనికి జిల్లా యంత్రాంగమే కారణమన్నట్లుగా ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి తీసుకొస్తోంది. మార్గదర్శులను ఒప్పించి ముందుకు తీసుకురావాలని, లేదంటే ప్రభుత్వ ఉద్యోగులే మార్గదర్శులుగా మారాలని చంద్రబాబు సర్కారు ఆదేశించింది. దీంతో అధికారులు షాక్‌కు గురయ్యారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, గెజిటెడ్ ర్యాంకు కలిగిన అధికారి కనీసం ఒక కుటుంబాన్ని దత్తత తీసుకోవాలి. ప్రతి ఆసుపత్రి నుంచి ఐదుగురు మార్గదర్శులుగా మారాలని కూడా స్పష్టం చేసింది. ఉద్యోగులు కూడా బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఒత్తిడి తీసుకొస్తోంది. తమ కుటుంబాలనే ఆర్థికంగా బలోపేతం చేసుకోలేకపోతున్న తాము, ఇప్పుడు ఇతరులను దత్తత తీసుకోవడంపై ఉద్యోగ వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇలా ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ, సర్వేలతో ప్రభుత్వం కాలక్షేపం చేస్తుండటంతో, తమకు ప్రభుత్వం ఏదో మేలు చేస్తుందని భావించిన నిరుపేద కుటుంబాలకు ఇప్పటికీ నిరాశే ఎదురవుతోంది.

సర్వేలతో కాలయాపన

తొలుత ఉగాది నాటికి బంగారు కుటుంబాలకు సాయం అందించే కార్యక్రమం ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మూడు నెలలు గడిచినా దాని ఆచూకీ లేదు. పైగా మరోసారి సర్వే చేయాలి, మ్యాపింగ్ చేయాలి, యాప్‌లో నమోదు చేయాలి, వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి అంటూ ప్రభుత్వం జిల్లా అధికారులకు రోజుకో కొత్త టాస్క్ ఇస్తూ వారిని ముప్పతిప్పలు పెడుతోంది. ఈ భారం అంతా సచివాలయ ఉద్యోగులపై పడుతోంది. చేసేది లేక ఉద్యోగులు మరోసారి సర్వే మొదలుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. జూలై 28 లోపు తుది జాబితా సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో, తొలుత గుర్తించిన 73,452 కుటుంబాల్లో మళ్లీ వడపోత నిర్వహించి, కోతలు విధించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు



సీతంపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలు, అరాచకాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు తీవ్రంగా ఖండించారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమమని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా, వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఓర్వలేకే కూటమి ప్రభుత్వం ఈ చర్యలకు పాల్పడుతోందని కేకే రాజు అన్నారు. కూటమి 164 స్థానాల్లో గెలిచినా కూడా, ఏడాది కాలంలోనే ప్రజల చీత్కారాన్ని ఎదుర్కొంటుందన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్కడికు వెళ్లినా వేలాదిగా ప్రజలు తరలివస్తున్నారని ఆయన గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు క్రియాశీలకంగా ఉంటే ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందని, ప్రజలు తిరగబడతారనే ఉద్దేశంతోనే లేని లిక్కర్ స్కామ్‌ను తెరపైకి తెచ్చారని ఆయన ఆరోపించారు. ఎక్కడా ఎలాంటి ఆధారాలు లేకుండా గత కొన్ని నెలలుగా కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న కొన్ని పత్రికల్లో, కొన్ని టీవీ చానళ్లలో తప్పుడు కథనాలు ప్రసారం చేసి, ఆ కథనాలను నిజం చేస్తూ ఒక్కొక్కరినీ అరెస్టులు చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఈ కుట్రలో భాగంగానే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ నాయకులు, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అన్యాయంగా, అక్రమంగా అరెస్టు చేశారని కేకే రాజు తీవ్రంగా మండిపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేద్దామనే ఉద్దేశంతో ఇదేవిధంగా అక్రమ అరెస్టులు కొనసాగిస్తే రాష్ట్ర ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చూస్తూ ఊరుకోరని ఆయన హెచ్చరించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీకి సంబంధించి ఎవరైతే అరెస్టులకు గురయ్యారో వారందరికీ తాము అండగా నిలబడతామని, వారి అక్రమ అరెస్టులకు నిరసనగా ఏ పోరాటానికైనా తామంతా సిద్ధమని కేకే రాజు ప్రకటించారు.

చంద్రబాబు పాలనలో అంతా మోసమే 8లో

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ఎలాంటి అపోహలొద్దు

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



సాక్షి, విశాఖపట్నం: స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విషయంలో ఎలాంటి అపోహలు అవసరం లేదని, వీటితో వినియోగదారులపై అదనపు భారం ఉండే అవకాశమే లేదని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్ల ప్రక్రియ విషయంలో వస్తున్న వదంతులపై ఆయన స్పందిస్తూ.. ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారుల సేవల్లో పారదర్శకతను మరింత పెంచేందుకు ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు జరుగుతోందని పేర్కొన్నారు. ఏపీఈఆర్సీ రెగ్యులేషన్ ప్రకారం ప్రభుత్వ, వాణిజ్య కేటగిరీల వినియోగదారులకు ప్రస్తుతం వీటిని అమర్చుతున్నామన్నారు. వీటితోపాటు ఎక్కువ విద్యుత్ వినియోగం కలిగిన (హై వేల్యూ) గృహ వినియోగదారులకు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ మీటర్ ఏర్పాటు సమయంలో వినియోగదారులు వాటి ఖరీదు, ఛార్జీలు కానీ, మామూళ్లు కానీ చెల్లించవలసిన అవసరం లేదని సీఎండి తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల వినియోగదారులపై విపరీత భారాలు పడతాయనే ఆందోళన అవసరం లేదన్నారు. స్మార్ట్ మీటర్లు పాత మీటర్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగాన్ని నమోదు చేయవని, వీటి కారణంగా బిల్లులు పెరిగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాత మీటర్లతో పోలిస్తే స్మార్ట్ మీటర్ల ద్వారా మరింత పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. ఏపీఈఆర్సీ నిర్ణయించిన టారీఫ్ ప్రకారమే విద్యుత్ బిల్లులు వసూలు చేస్తామని పేర్కొన్నారు. బిల్లు వివరాలను నేరుగా వినియోగదారుని మొబైల్ కు చేరవేస్తామని చెప్పారు. వినియోగం, ఖర్చుపై పూర్తి నియంత్రణ వినియోగదారుల చేతుల్లో ఉండటం వలన విద్యుత్ వినియోగాన్ని మెరుగ్గా ప్లాన్ చేయడంలో స్మార్ట్ మీటర్లు సహాయకరిస్తాయన్నారు. ఈ విషయంలో ఎలాంటి సందేహం ఉన్నా.. టోల్ ఫ్రీ నం.1912కి సంప్రదించాలని సీఎండీ పృథ్వీతేజ్ ప్రకటనలో సూచించారు.

నౌకల కేంద్రంలో సైకిల్ సవారీ!

రక్షణ దళ ఉద్యోగులు ఇలా సైకిల్‌పై చక్కర్లు కొడుతున్నారేంటి.? అనేగా మీ సందేహం... ఏమీ లేదండీ.. నౌకల నిర్మాణం, మరమ్మతుల్లో నిత్యం బిజీగా ఉండే రక్షణ దళ ఉద్యోగులు డాక్‌లో విహరించేందుకు ఏర్పాటు చేసిన పబ్లిక్ సైకిల్ షేరింగ్ సిస్టమ్(పీబీఎస్ఎస్) ఇది. ఓహో ఎందుకు ఏర్పాటు చేశారు.? వారికి వాహనాలుంటాయి కదా.. వాటిపై వెళ్లొచ్చు కదా.. అని అనుకోవద్దు.. దీని వెనుక పర్యావరణహిత ఆలోచనతో పాటు ఆరోగ్య రహస్యమూ ఉందండోయ్. ఆ వివరాలు చదవండి.



సిద్ధంగా సైకిళ్లు



సైకిళ్లపై విధులకు హాజరవుతున్న రక్షణదళ ఉద్యోగులు

- నేవల్ డాక్‌యార్డులో పబ్లిక్ సైకిల్ షేరింగ్ సిస్టమ్
- పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొత్త అధ్యాయం
- డాక్‌యార్డ్‌లో వాహన వినియోగాన్ని తగ్గించేందుకు ఏర్పాటు
- మొత్తం 15 స్టాండ్స్‌లో అందుబాటులో 300 వరకూ సైకిళ్లు

సాక్షి, విశాఖపట్నం: వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి. విచ్చలవిడి వాహన వినియోగం కారణంగా కర్బన ఉద్గారాలు పెరుగుతున్నాయి. ఫలితంగా అనారోగ్య సమస్యల బారినపడుతున్న వారి సంఖ్యా పెరుగుతోంది. ఇక సముద్రపుటంచుల్లో నౌకా నిర్మాణం, మరమ్మతులతోపాటు దేశ రక్షణ కోసం సాగర జలాల్లో నిరంతర పహారా కాస్తున్న నౌకాదళ ఉద్యోగుల పరిస్థితి ఇంకా దారుణంగా ఉంటుంది. అందుకే డాక్‌యార్డులో కొంత మేరైనా కర్బన ఉద్గారాలను నియంత్రించి కాలుష్యాన్ని తగ్గించేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ ఈ తరహా ఆలోచన చేసింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా విశాఖలోని నావల్ డాక్‌యార్డ్‌లో స్మార్ట్ పబ్లిక్ సైకిల్ షేరింగ్ సిస్టమ్ (పీబీఎస్ఎస్) అమలు చేస్తోంది.

ఎంతసేపు తొక్కొచ్చు?

ఒక వ్యక్తి రిజిస్టర్ చేసుకున్న తర్వాత 2 గంటల పాటు సైకిల్‌ను తొక్కొచ్చు. డాక్‌యార్డులో ఒక చోట నుంచి మరో చోటికి వెళ్లేందుకు ప్రతి ఒక్క ఉద్యోగి, సిబ్బంది ఈ సైకిల్ పైనే ఆధారపడుతున్నారు? సొంత వాహనాలున్నా సైకిల్ తొక్కేందుకే మొగ్గు చూపుతున్నారు. 2 గంటల తర్వాత మళ్లీ వచ్చి రిజిస్టర్ చేసుకుంటే మరో రెండు గంటలు ఎంచక్కా తొక్కెయ్యొచ్చు. బయటకి తీసుకెళ్లేందుకు ఎలాంటి అనుమతి లేదు. ఎందుకంటే సైకిల్‌ను డాక్‌యార్డు లోపల పరిధిలోనే నడపాలి. సైకిల్‌పై పీబీఎస్ఎస్ డాక్‌యార్డ్ విశాఖపట్నం అని స్టిక్కరింగ్ కూడా ఉంటుందండోయ్.

స్థానిక మహిళలకు ఉపాధి

డాక్‌యార్డు పరిధిలో మొత్తం 15 చోట్ల ఈ సైకిల్ స్టాండ్స్ ఉన్నాయి. ఒక్కో స్టాండ్‌లో 20 వరకూ సైకిల్స్ అందుబాటులో ఉంచారు. అంటే మొత్తం 300 సైకిల్స్ ఉన్నాయన్నమాట. ప్రతి రెండేళ్లకోసారి కాంట్రాక్టర్‌ని మార్చుతుంటారు. ఆ సమయంలో పాత సైకిళ్ల స్థానంలో కొత్త సైకిళ్లు ఏర్పాటు చేస్తుంటారు. కేవలం కర్బన ఉద్గారాలు తగ్గించడం, ఆరోగ్యకరమైన హరిత రవాణా ప్రత్యామ్నాయాల్ని ప్రోత్సహించడం ఒక ఎత్తయితే.. స్థానిక మహిళలకు ఆర్థిక చేయూతనందించడం కూడా మరో ఎత్తు. స్థానిక మహిళలు దాదాపు 20 మంది ఈ సైకిల్ వ్యవస్థ ద్వారా లబ్ధి పొందుతున్నారు. కాలుష్య నియంత్రణతో పాటు మహిళా సాధికారతకు కూడా పెద్దపీట వేస్తున్న నేవల్ డాక్‌యార్డుకు హ్యాట్సాఫ్ చెప్పేద్దాం.

సైకిళ్లు ఎవరికి ఇస్తారు ?

డాక్‌యార్డులో పనిచేసే ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు, సెయిలర్స్, ఇంజినీర్లతోపాటు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే ప్రతి ఒక్కరికీ ఈ సైకిళ్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడ పనిచేసే ప్రతి కార్మికుడు, ఉద్యోగికి ఎంప్లాయ్ ఐడీ ఉంటుంది. దాని ప్రకారం ఎస్ఎంఎస్ ఆధారిత రిజిస్ట్రేషన్‌ను ఫోన్‌లో చేస్తారు. డాక్‌లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది ఐడీ నంబర్లన్నీ.. సేఫ్ అయ్యే యాప్ సాయంతో సైకిళ్లను ఇస్తున్నారు. ఐడీ నంబర్, ఫోన్ నంబర్ చెబితే ఓటీపీ వస్తుంది. ఓటీపీ రాగానే సదరు వ్యక్తి సైకిల్‌పై డాక్‌యార్డులో షికారు చేసుకోవచ్చు.

రాష్ట్ర స్విమ్మింగ్ ఓవరాల్‌చాంప్ విశాఖ

- రన్నరప్స్‌గా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు
- వ్యక్తిగత చాంప్‌లు స్వామి, పార్థవి, పృథ్వీ, యానా



ఉమ్మడి చాంప్స్ గణేష్, అవినాష్, కార్తికేయ



గ్రూప్ వన్ బాలికల చాంప్ పావని



ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన విశాఖ జట్టు

విశాఖ స్పోర్ట్స్: పదవ ఏపీ సబ్‌జూనియర్, జూనియర్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌ను విశాఖ జట్టు సాధించాయి. ఫస్ట్ రన్నరప్‌గా ఎన్టీఆర్, సెకండ్ రన్నరప్‌గా కృష్ణాజిల్లా జట్టు నిలిచాయి. విశాఖ సాగరతీరంలోని అక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారంతో ముగిసిన ఈ చాంపియన్‌షిప్‌లో గ్రూప్ 3 బాలురలో బి.స్వామి(ఏలూరు) బాలికల్లో వై.పార్థవి(కృష్ణా), గ్రూప్ 2 బాలురలో బి.పృథ్వీరాజ్, బాలికల్లో యానాజైన్(వీరిద్దరూ ఎన్టీఆర్) వ్యక్తిగత చాంప్‌లుగా నిలిచారు. గ్రూప్‌లో 1 బాలురలో జె.గణేష్‌చక్రధర్(విశాఖ),పి.అవినాష్(శ్రీకాకుళం),ఎస్.కార్తికేయ(అనంతపురం)లు సముజ్జీలుగా నిలిచి వ్యక్తిగత చాంప్‌లను పంచుకోగా బాలికల్లో ఎస్.పావని శరయు(ఎన్టీఆర్) వ్యక్తిగత చాంప్‌లుగా నిలిచారు. ఈ చాంపియన్‌షిప్‌లో మూడు గ్రూప్ కాటగిరిల్లో బాలబాలికలకు ఫ్రీస్టయిల్, బ్యాక్‌స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్‌ఫ్లై అంశాలతో పాటు ఇండివిడ్యువల్ మెడ్లీ నిర్వహించారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో విశాఖ జిల్లా జట్టు 15 స్వర్ణాలు, 27 రజతాలు, 23 కాంస్యాలతో 179 పాయింట్లు సాధించి ఆధిక్యంలో నిలిచాయి. ఎన్టీఆర్ జిల్లా జట్టు 22 స్వర్ణాలు, 12కాంస్యాలు, 9 రజతాలతో మొత్తంగా 155 పాయింట్లతో రన్నరప్‌గా, కృష్ణాజిల్లా జట్టు 9 స్వర్ణాలు, 12 కాంస్యాలు, 15 రజత పతకాలతో మొత్తంగా 90 పాయింట్లతో సెకండ్‌రన్నరప్‌గా నిలిచాయి. గుంటూరు, ఏలూరు, బాపట్ల, అనంతపురం, శ్రీకాకుళం, కాకినాడ, వైఎస్ఆర్ కడప జిల్లా జట్లు టాప్‌టెన్‌లో నిలిచాయి. విజయనగరం జిల్లా జట్టు మూడు స్వర్ణాలు(5 కాంస్యాలు) సాధించినా మొత్తంగా 20 పాయింట్లే సాధించగలగడంతో 12వ స్థానంతో సరిపుచ్చింది. కర్నూలు జిల్లా జట్టు స్వర్ణాలు సాధించలేకపోయినా ఆరు రజతాలు, మూడు కాంస్యాలతో 21 పాయింట్లతో పదకొండో స్థానానికి చేరుకుంది. జిల్లా స్విమ్మింగ్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు సంతోష్, వెంకట్‌రామ్ తదితరులు విజేతలకు బహుమతులందించారు.

గోడ కూలి ఇద్దరు కార్మికుల మృతి





మృతులు ధర్మారావు, రామారావు

మల్కాపురం: మరో అరగంటలో ఇంటికి వెళ్లాల్సిన సమయంలో విధి కాటేసింది. గోడ కూలిన సంఘటనలో ఇద్దరు కూలీలు మృతి చెందారు. ఈ దుర్ఘటనతో వారి కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. మల్కాపురం పోలీసులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. 61వ వార్డు, మల్కాపురం సమీపంలోని ప్రకాష్‌నగర్‌లో మజ్జి ధర్మారావు(50), భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో జీవనం సాగిస్తున్నాడు. జై ఆంధ్ర కాలనీకి చెందిన సంగారు రామారావు(59) కూడా భార్య, ఇద్దరు కుమార్తెలతో నివాసం ఉంటున్నాడు. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నప్పటికీ ధర్మారావు, రామారావు ఇద్దరూ రోజువారీ కూలి పనులకు వెళ్లేవారు. ఆదివారం డాక్‌యార్డ్ సమీపంలోని వీడీఆర్ గొడౌన్‌కు దగ్గరలో ఉన్న ప్రత్యూష గొడౌన్స్‌లో నిర్మాణంలో ఉన్న గోడ పనులకు వెళ్లారు. గొడౌన్‌లో నౌకల ద్వారా పోర్టుకు వచ్చే వ్యవసాయ ఉత్పత్తులను ప్యాకింగ్ చేస్తుంటారు. కొద్ది రోజులుగా ఇక్కడ గోడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆదివారం పని ప్రారంభించిన ధర్మారావు, రామారావులు, మరో 30 నిమిషాల్లో పని ముగించుకుని ఇంటికి వెళ్లాల్సి ఉండగా, నిర్మాణంలో ఉన్న గోడ ఒక్కసారిగా కూలిపోయింది. గోడ శిథిలాల కింద చిక్కుకుపోయి తీవ్రంగా గాయపడిన ధర్మారావు, రామారావులను తోటి కార్మికులు కేజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రికి వెళ్లలోపే ధర్మారావు మృతి చెందగా.. రామారావు చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కేజీహెచ్‌కు వెళ్లి వివరాలు సేకరించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. ఫిర్యాదు అందిన తర్వాత విచారణ చేపడతామన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం(జాతర)లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కూచిపూడి నత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. నగరంలోని శ్యామలా డ్యాన్స్ అకాడమీ కళాకారులు ప్రశాంతి, చాందిని, హారిక, రక్షిత, తులసి, దేవీప్రసన్న, హరిణి, అమృత చేసిన నృత్యాలు అలరించాయి.

దేవుడా.. బతికించు..

2025, మే 14.. స్నేహితుడి పెళ్లి వేడుకలో ఆనందంగా ఉన్న ఆ వ్యక్తికి తెలీదు.. ఆ రోజే తన జీవితాన్ని, తన కుటుంబాన్ని శాశ్వతంగా మార్చేస్తుందని. భోజనం చేస్తుండగా అకస్మాత్తుగా పైనుంచి పెచ్చులూడి పడిన శ్లాబ్.. అతని భవిష్యత్తును, అతని కుటుంబ ఆశలను దారుణంగా కూల్చేసింది. జీవీఎంసీ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి ఆ నిండు ప్రాణం రెండు నెలలుగా చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఒకప్పుడు తన కాళ్లపై తాను నిలబడి, కుటుంబానికి ఆసరాగా ఉండే వ్యక్తి.. నేడు హాస్పిటల్ బెడ్‌కు పరిమితమై, కదల్లేని స్థితిలో రోజులు వెళ్లదీస్తున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేసి రెండు నెలలైంది. పీజీఆర్‌ఎస్‌లో అర్జీ ఇచ్చి వారం రోజులు గడిచింది. ఎమ్మెల్యే చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయినా.. ఆ కుటుంబానికి ఎలాంటి భరోసా దక్కడం లేదు. - తాటిచెట్లపాలెం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలకృష్ణ

- కూలిన శ్లాబ్‌తో కుప్పకూలిన కుటుంబం
- జీవీఎంసీ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మంచానికే యువకుడు పరిమితం
- రూ.లక్షలు ఖర్చయినా కోలుకోని బాధితుడు
- సాయం కోసం ఆ కుటుంబం వేడుకోలు


ప్రమాదం జరిగిన జీవీఎంసీ కల్యాణమండపంలో కూలిన శ్లాబ్ భాగం

కంచరపాలేనికి చెందిన బాలకృష్ణది మధ్యతరగతి కుటుంబం. యూపీవీసీ కిటికీలు అమర్చే సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ.. ఏడో నెల గర్భిణి అయిన తన భార్యతో సంతోషంగా జీవిస్తున్నాడు.


బాలకృష్ణ(ఫైల్)

2025 మే 14న తన స్నేహితులతో కలిసి దొండపర్తిలోని జీవీఎంసీ కల్యాణమండపంలో తన స్నేహితుడి పెళ్లికి హాజరయ్యాడు. ఫొటోలు, సరదా కబుర్లతో అంతా బాగానే జరిగింది. ఆ తర్వాత మొదటి అంతస్తులో బాలకృష్ణ తన స్నేహితులైన బాలరాజు, శివశంకర్‌లతో కలిసి భోజనం చేస్తుండగా.. ఊహించని ప్రమాదం జరిగింది. వారిపై శ్లాబ్ పెచ్చులు ఒక్కసారిగా ఊడిపడ్డాయి. ఈ ఘటనలో శివశంకర్‌కు తలకు బలంగా దెబ్బ తగిలి 16 కుట్లు పడ్డాయి. బాలరాజు కాలి బొటన వేలు చితికిపోయింది. బాలకృష్ణకు మాత్రం తల నుంచి వెన్నుముక వరకు తీవ్ర గాయం తగిలింది. ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్‌లు చేయగా.. అతని స్పైనల్ కార్డ్ దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించారు. బాలకృష్ణ కుటుంబంపై ఈ ప్రమాదం పిడుగులా పడింది.

కరిగిపోయిన డబ్బు

రెండు నెలలుగా బాలకృష్ణ ఆసుపత్రి మంచానికే పరిమితమై, కదల్లేని స్థితిలో ప్రాణాలతో పోరాడుతున్నాడు. గత నెల 2వ తేదీ వరకు ఓమ్ని ఆర్కేలో ఉంచి సర్జరీ చేశారు. దీనికి దాదాపు రూ.11 లక్షలు ఖర్చయింది. అయినా బాలకృష్ణ మంచానికే పరిమితమయ్యాడు. ప్రస్తుతం కలెక్టర్ ఆఫీస్ జంక్షన్ వద్ద ఉన్న రీహ్యాబ్ సెంటర్ (ఆర్‌ఓఎస్ హాస్పిటల్)లో చికిత్స జరుగుతోంది. ఇక్కడ నెలకు రూ. 2.5 లక్షలు ఖర్చవుతోంది. మరో ఆరు నెలలు చికిత్స అవసరమని, అయినా పూర్తిగా కోలుకుంటాడని గ్యారెంటీ ఇవ్వలేమని అక్కడి వైద్యులు తెలిపారు. ఆ మాటలు ఆ కుటుంబాన్ని మరింత కుంగదీస్తున్నాయి.

వ్యవస్థతో ఒంటరి పోరాటం

ఒకవైపు ఆసుపత్రి ఖర్చులు, మరోవైపు న్యాయం కోసం పోరాటం... ఈ రెండింటి మధ్య బాలకృష్ణ కుటుంబం నలిగిపోతోంది. ఏడో నెల గర్భిణి అయిన బాలకృష్ణ భార్య, తన ఉద్యోగాన్ని సైతం వదులుకుని రేయింబవళ్లు భర్తకు సేవ చేస్తోంది. ఒకవైపు కడుపులో పెరుగుతున్న బిడ్డ, మరోవైపు కదలలేని భర్త... ఆమె పడుతున్న మానసిక వేదన వర్ణనాతీతం. పోలీసులు పిలిచిన ప్రతీసారి ఆ నిండు గర్భిణి స్టేషన్ చుట్టూ తిరుగుతూనే ఉంది. 'మా అన్నయ్యకు అన్యాయం జరిగి రెండు నెలలైంది. మే 15నే ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. స్పందనలో కూడా అర్జీ పెట్టుకున్నాం. ఎమ్మెల్యేని కలిశాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. కల్యాణ మండపం కాంట్రాక్టర్ గానీ, జీవీఎంసీ అధికారులు గానీ కనీసం పరామర్శించడానికి కూడా రాలేదు' అని బాలకృష్ణ సోదరుడు సంతోష్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

భద్రత గాలికి...: దొండపర్తిలోని ఈ కల్యాణ మండపాన్ని వేడుకలకు అద్దెకు ఇస్తున్నారు. ప్రజల నుంచి వేలకు వేలు అద్దెలు వసూలు చేసే జీవీఎంసీ.. ఆ కల్యాణ మండపం నిర్వహణను గాలికొదిలేసింది. ప్రమాదం జరిగిన తర్వాత మండపాన్ని మూసివేసి చేతులు దులుపుకుంది. అక్కడ కనీస భద్రతా ప్రమాణాలు లేవు. సీసీ కెమెరాలు, ఫైర్ సేఫ్టీ, కనీసం ఒక ఇన్సూరెన్స్ కూడా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం.

సాయం కోసం ఎదురుచూపులు

'ఇప్పటివరకు మా దగ్గర ఉన్నది. మాకున్న వాటిని అమ్ముకున్నాం. హెల్త్ ఇన్సూరెన్స్‌లను వాడుకుని చికిత్స చేయించాం' అని సంతోష్ కన్నీటి పర్యంతమయ్యారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కలిశామని, ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసుకున్నందున సీఎం సహాయ నిధి రాదని, కల్యాణ మండపం లీజుదారుడితో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని సంతోష్ తెలిపారు. కానీ ఇప్పటికీ ఎలాంటి సాయం అందలేదన్నారు. దయచేసి నా సోదరుడు బాలకృష్ణ చికిత్సకు ఆర్థిక సాయం చేస్తే చాలు.. మాకు ఇంకేమీ వద్దని సంతోష్ విజ్ఞప్తి చేశారు. **స్నేహితుడి పెళ్లిలో ఆనందంగా గడపాల్సిన అతను.. నేడు చావుబతుకుల మధ్య ఉన్నాడంటే దానికి కారణం ఎవరు? బాధ్యులెవరు? ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న ఆ కుటుంబానికి న్యాయం జరగాలని కోరుకుందాం.**

చంద్రబాబు పాలనలో అంతా మోసమే


కరపత్రం ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, పార్టీ నేతలు

- 'కూటమి' ఇచ్చిన హామీలన్నీ అమలయ్యే వరకు పోరాడుతాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు


మహిళలకు చంద్రబాబు మోసాలను వివరించి కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: కూటమి ప్రభుత్వం చేత హామీలన్నీ అమలు చేయించడమే 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమ ఉద్దేశమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో వార్డులోని డీఎస్‌ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించి, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో జరుగుతున్న మోసం, అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలను స్పష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. వార్డులోని ప్రతి బూత్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎలా అమలు చేయడం లేదో తెలియజేస్తూ, చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలన్నారు.

పరిపాలనలో కూటమి ప్రభుత్వం విఫలం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో 2019–24 వరకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందన్నారు. చంద్రబాబు పరిపాలనలో విఫలం చెంది.. నిస్సిగ్గుగా సూపర్‌సిక్స్ హామీలన్నీ అమలై పోయాయని వారి అనుకూల మీడియా ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కె.కె.రాజు మండిపడ్డారు. ప్రజల పక్షాన పోరాడుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తల మీద తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు తామంతా పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

చంద్రబాబు మోసాలపై ఇంటింటా ప్రచారం

సమావేశ అనంతరం 24వ వార్డులోని పలు ఇళ్లకు కె.కె.రాజు, పార్టీ నాయకులు వెళ్లి ప్రజలను కలిశారు. కూటమి నేతలు ఇచ్చిన హామీల ప్రకారం లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. చాలా మంది మహిళలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏవీ అమలు కావడం లేదని, ఈ ప్రభుత్వంలో ఎటువంటి సంక్షేమ పథకాలు రావడం లేదని వాపోయారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కరపత్రాలను స్థానికులకు చూపించి సీఎం చంద్రబాబు చేసిన మోసాలను ప్రతి గడపకు వెళ్లి వివరించారు. జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, పార్టీ 24వ వార్డు అధ్యక్షుడు గుడ్ల అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు పులగం కొండారెడ్డి, ఉత్తర వాణిజ్య విభాగ అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు దల్లి రామకృష్ణారెడ్డి, నీలి రవి, వార్డు నాయకులు లోకేష్, సీతాకుమారి, నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, క్రాంతినగర్, గాంధీనగర్, తులసీపేట, వినాయకనగర్ గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

అమెజాన్ గొడౌన్ ఉద్యోగులకు న్యాయం

గాజువాక: మిందిలోని అమెజాన్ గొడౌన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ సాయం చేశారు. ఉద్యోగులకు అదనపు జీతం ఇప్పించేందుకు యాజమాన్యాన్ని ఒప్పించారు. ఈ గొడౌన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు తెలియకుండానే వారిని పెందుర్తిలోని గుర్రంపాలేనికి బదిలీ చేయడానికి యాజమాన్యం ప్రయత్నించింది. దీంతో ఆందోళన చెందిన ఉద్యోగులు మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను, వైఎస్సార్‌సీపీ నాయకుడు లతీష్‌ను కలిసి తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. దీనిపై స్పందించిన లతీష్.. అమెజాన్ ఉన్నత యాజమాన్యంతో, వెండర్లతోనూ మాట్లాడి ఉద్యోగులకు 40 రోజుల అదనపు జీతం చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. ఈ డిమాండ్‌కు యాజమాన్యం అంగీకరించినట్లు లతీష్ తెలిపారు. ఈ సందర్భంగా గొడౌన్ ఉద్యోగులు అమర్‌నాథ్‌కు, లతీష్‌లకు ధన్యవాదాలు తెలిపారు.


వైఎస్సార్ సీపీ నాయకుడు లతీష్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న గొడౌన్ ఉద్యోగులు

శాకంబరిగా ఎరుకుమాంబ

సీతంపేట: దొండపర్తిలో కొలువైన ఎరుకుమాంబ అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం నాలుగో ఆదివారం సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారిని పలు రకాల కూరగాయలు, ఆకుకూరలతో నేత్రపర్వంగా అలంకరించారు. వేకువజాము నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. దేవస్థానం ఈవో జి.వి.రమాబాయి అమ్మవారికి తొలి పూజలు నిర్వహించారు. ఎరుకుమాంబకు జల, క్షీరాభిషేకాలు, కుంకుమార్చనలు ఘనంగా జరిగాయి. ఈ నెల 25 నుంచి శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభవుతాయని ఈవో రమాబాయి తెలిపారు.



7 నుంచి శ్రీమన్నారాయణ యాగం

బీచ్‌రోడ్డు: ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ సనాతన ధర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మహా మండలేశ్వర్ అనంత విభూషిత నారాయణానందగిరి మహారాజ్ ఆధ్వర్యంలో.. ఆగస్టు 7 నుంచి 10వ తేదీ వరకు అష్టోత్తర శత కుండాత్మక శ్రీ మహాలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ యాగం నిర్వహించనున్నట్లు అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు తెలిపారు. దసపల్లా హిల్స్ వద్ద గల పోర్టు గెస్ట్ హౌస్‌లో ఆదివారం ఆయన ఈ యాగం వివరాలను మీడియాకు వెల్లడించారు. ప్రస్తుత సమాజంలో నెలకొన్న విపత్తులను నివారించి.. విశ్వశాంతిని నెలకొల్పేందుకు నారాయణానందగిరి మహారాజ్ దేశవ్యాప్తంగా 12 యాగాలు చేయాలని సంకల్పించారన్నారు. ఇందులో మొదటిది దసపల్లా హిల్స్ వద్ద పోర్ట్ గెస్ట్ హౌస్ ఎదురుగా ఉన్న ఏపీఐఐసీ గ్రౌండ్స్‌లో 7 నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. 7వ తేదీ సాయంత్రం పసుపు కుంకుమల కలశాలతో మహిళలు, వివిధ వాయిద్య కళాకారులతో కూడిన శ్రీ లక్ష్మీనారాయణుల శోభాయాత్ర, 8న యాగశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసే నమూనా ఆలయంలో సుప్రభాత సేవ, వేదపారాయణం, సువర్ణ పుష్పార్చన, విష్వక్సేన పూజ, గరుడ పతాక ప్రతిష్టాపన, దీక్షా వస్త్ర ధారణ, యాగశాలలో అగ్ని ప్రతిష్టాపన, పలు హోమాలు, వేదపారాయణం నిర్వహణ ఉంటుందన్నారు. 9న శ్రీమన్నారాయణ వ్రతం, సనాతన ధర్మ సంరక్షణ సభ జరుగుతాయని తెలిపారు. అనంతరం శ్రీ మహాలక్ష్మి నారాయణ యజ్ఞ లఘు పూర్ణాహుతి, వేదపారాయణం నిర్వహిస్తామన్నారు. చివరి రోజు పలు హోమాలతో పాటు సనాతన ధర్మ సంరక్షణ సభ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖుల ప్రసంగాలు, పండితుల ప్రవచనాలు, పూర్ణాహుతితో యాగం ముగుస్తుందని రేజేటి శ్రీరామాచార్యులు పేర్కొన్నారు. యాగం నిర్వహించే మూడు రోజులు అన్నదానం ఉంటుందని, ప్రతి రోజూ సాయంత్రం ఆర్కే బీచ్‌లో సాగరహారతి నిర్వహిస్తామని వెల్లడించారు. సమావేశంలో కె.ప్రమీలాదేవి, మానస సరోజ్, విష్ణు, సినీనటుడు కుమరన్, సతీష్ కుమార్, నయని, సూర్య, సంతోష్, రవికుమార్, దేవత్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

పరవాడ: లంకెలపాలెం కూడలిలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందారు. లంకెలపాలెం దరి శ్రీనగర్ కాలనీలో దాసరి ఆదిలక్ష్మి(67) తన భర్తతో కలిసి నివాసం ఉంటున్నారు. కూర్మన్నపాలెంలో ఉంటున్న తన కూతురిని చూసేందుకు ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో బయలుదేరారు. లంకెలపాలెం కూడలిలో ఆటో ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా.. వేగంగా వచ్చిన సిమెంట్ లారీ ఆమెను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆదిలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలాన్ని పరవాడ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్, సీఐ ఆర్. మల్లికార్జునరావు సందర్శించి.. ప్రమాదానికి గల కారణాలను సేకరించారు. మృతురాలి కుమారుడు దాసరి వెంకట్ కిరణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వేగ నియంత్రణకు చర్యలు

లంకెలపాలెం జంక్షన్ మీదుగా ప్రయాణించే వాహనాల వేగాన్ని నియంత్రించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీఐ మల్లికార్జునరావు తెలిపారు. జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించే వాహనాల వేగాన్ని తగ్గించి, అన్ని వైపుల నుంచి ప్రయాణికులను గమనిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. కూడలిలో ట్రాఫిక్ నియంత్రణ కోసం రోడ్డు భద్రతా చిహ్నాలు, స్టాపర్లు, పికెట్లను ఏర్పాటు చేసినట్లు సీఐ వెల్లడించారు. ప్రజలు రోడ్డు దాటే సమయంలో అన్ని వైపుల నుంచి వాహనాలను చూసుకొని జాగ్రత్తగా రోడ్డు దాటాలని కోరారు. కూడలిలో ట్రాఫిక్ పోలీసులకు ప్రయాణికులు, ప్రజలు సహకరించడం ద్వారా ప్రమాదాలను నివారించడం సాధ్యపడుతుందని సీఐ మల్లికార్జునరావు విజ్ఞప్తి చేశారు.


ఘటనా స్థలంలో మృతి చెందిన దాసరి ఆదిలక్ష్మి

34 కిలోల గంజాయి స్వాధీనం

తగరపువలస: ఆనందపురం మండలం సత్రం జంక్షన్ సర్వీస్ రోడ్డు వద్ద ఆదివారం 34 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో ఒక మైనర్ ఉన్నాడు. ముందస్తు సమాచారంతో ఆనందపురం సీఐ వాసునాయుడు, ఎస్‌ఐ శివ తమ సిబ్బందితో సత్రం జంక్షన్ వద్దకు వెళ్లారు. అక్కడ గంజాయి నింపిన బ్యాగులతో ఉన్న నిందితులు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. అరెస్ట్ అయిన వారిలో పార్వతీపురం మన్యం జిల్లా రామునాయుడు గ్రామానికి చెందిన మరిపి గోవిందరావు అలియాస్ గౌతమ్, ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా బలిమెలకు చెందిన మైనర్(16) ఉన్నారు. సీఐ వాసునాయుడు ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భద్రతా ప్రమాణాలపై ట్రాలీమెన్‌లకు అవగాహన

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పుష్ ట్రాలీ, మోటార్ ట్రాలీ, మోపెడ్ ట్రాలీల పనితీరుపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. డీఆర్‌ఎం కార్యాలయం సమీపంలోని డివిజనల్ పీవే శిక్షణ కేంద్రంలో జరిగిన సెమినార్‌లో సీనియర్ డీఈఎన్ (సౌత్) బి.నవీన్ రాజు మాట్లాడారు. ప్లెయిన్, ఘాట్ సెక్షన్లలో పుష్, మోటార్, మోపెడ్ ట్రాలీలకు సంబంధించిన విధి విధానాలను వివరించారు. ట్రాలీమెన్ వీటి విధి విధానాలను పూర్తిగా అర్థం చేసుకోవాలని సూచించారు. వీటిని వినియోగించే ముందుగా ట్రాలీ పరికరాలు, బ్రేకులు, ప్రతి దానినీ క్షుణ్ణంగా పరీక్షించుకోవాలని స్పష్టం చేశారు. సీనియర్ డీఈఎన్ (ఈస్ట్) బి.సాయిరాజు మాట్లాడుతూ ప్రధాన ట్రాలీమెన్ సమక్షంలో నలుగురు సుశిక్షితులైన ట్రాలీమెన్‌లు ట్రాలీలను వినియోగించాలని, కచ్చితంగా సూచనలు పాటించాలన్నారు. ట్రాక్‌లపై వెళ్తున్నప్పుడు స్టేషన్ల వద్ద ఆయా సమయాల్లో రిపోర్టింగ్ తీసుకునే హెడ్ ట్రాలీమెన్ తప్ప మరెవరూ మొబైల్ ఫోన్లు వినియోగించరాదని హెచ్చరించారు. ట్రాలీల నిర్వహణ సమయంలో సిబ్బంది అత్యంత జాగరూకతతో వ్యవహరిస్తూ, భద్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. సెమినార్ అనంతరం సీనియర్ డీఈఎన్‌లు, ఏడీఈఎన్‌లు కేజీపీ రాజు, ఎస్.కె.సింగ్, ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ సత్యనారాయణలతో కలిసి మోడల్ రూమ్, మోడల్ ట్రాక్‌రూమ్, డెమో ట్రాక్‌లను పరీక్షించారు.


మాట్లాడుతున్న వాల్తేర్ డివిజన్ సీనియర్ డీఈఎన్ నవీన్‌రాజు

సాక్షి క్లాసిఫైడ్స్

Services

CHANGE OF NAME

I, Chandan Kumar Patro S/o. Babulal Patro Residing At 19-9 Swatantra Nagar, Madhurawada, Visakhapatnam (Rural), Visakhapatnam, Andhra Pradesh - 530041, Have Changed My Name To Battula Chandan Kumar For All Future Purposes [DA-39424]

GOLD LOANS

లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14035]

Wanted

ప్రముఖ సంస్థలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ (F) & టెలికాలర్స్ (F) కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. WhatsApp : 99491 29054 [V- 2187]

CHANGE OF NAME

I, TALIB IMRAN IZZY (New Name), S/o. IMRAN BHAI, previously called as TALIB IZZY (Old Name), resident of Flat No.502, Sahitya Enclave, Mubarak Layout, Yendada, Visakhapatnam-530045, Andhra Pradesh. Now changed my name from TALIB IZZY (Old Name) To TALIB IMRAN IZZY (New Name). Henceforth I will be called as TALIB IMRAN IZZY (New Name) for all purposes.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959021122, 9959031122 [B-1275588]

డైరెక్ట్ జాయినింగ్ మాకంపెనీ లందు కాలేజీ లందు సూపర్ వైజర్స్ స్టోర్ ఇంచార్జి డ్రైవర్లు EX–ఆర్మీకా. (రూమ్, భో) PF, ESIజీ. 18–32K సె.8341821079. [SCA25006472]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
దాబాగార్డెన్స్, జగదాంబ MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా నాలుగు లైన్లు రూ.475/- అదనపు లైను రూ.100/- + 5% జి.ఎస్.టి. అదనం

విదేశీ మద్యం పట్టివేత

రూ.18 లక్షల విలువైన 220 బాటిళ్ల స్వాధీనం

అరిలోవ: నగరంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒకరి నుంచి 220 విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ తెలిపారు. పితాపురంకాలనీలోని సీతమ్మధార ఎక్సైజ్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. అక్కయ్యపాలెం లలితానగర్‌లో చెన్నైకి చెందిన తిరుపతి వెంకటేశన్ పిళ్లై అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో.. ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది నిఘా పెట్టారు. ఇందులో భాగంగా శనివారం స్కూటీలో మద్యం బాటిళ్లు పెట్టి విక్రయిస్తున్న అతన్ని లలితానగర్‌లో పట్టుకుని వివరాలు సేకరించారు. పిళ్లై కొన్నాళ్లుగా లలితానగర్‌లో నివాసం ఉంటూ ఒక గొడౌన్‌ను అద్దెకు తీసుకున్నాడు. చెన్నై నుంచి విదేశీ మద్యం బాటిళ్లను తీసుకువచ్చి తెలిసిన వారికి విక్రయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సమాచారం అందుకున్న ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం అతనిని పట్టుకొని గోడౌన్‌ను తనిఖీ చేశారు. అందులో 34 బ్రాండ్లకు చెందిన 220 విదేశీ మద్యం బాటిళ్లతో పాటు రూ.4,310, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేశారు. ఈ మద్యం బాటిళ్ల ధర రూ.15 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. దాడుల్లో ఎక్సైజ్ అధికారులు రాజశేఖర్, ముసలినాయుడు, సిబ్బంది అప్పారావు, కె.వి.ఎం.రాజు, సతీష్ పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

కాపురంలో చిచ్చురేపిన మద్యం

ఉరేసుకుని భర్త ఆత్మహత్య


లక్ష్మణరావు(ఫైల్)

పీఎంపాలెం: స్థానిక ఆర్‌హెచ్ కాలనీకి చెందిన కొర్లపు లక్ష్మణరావు (55) అనే వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై పీఎం పాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. ఆర్‌హెచ్ కాలనీలో నివసిస్తున్న లక్ష్మణరావు మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్య విజయలక్ష్మిని వేధించేవాడు. అంతేకాకుండా ఎలాంటి పనిపాట లేకుండా తిరిగేవాడు. ఈ విషయమై భార్యాభర్తలు తరచూ గొడవ పడేవారు. అతని వేధింపులు తాళలేక విజయలక్ష్మి భర్త నుంచి వేరుగా ఉంటోంది. భార్య దూరం పెట్టడంతో జీవితంపై విరక్తి చెందిన లక్ష్మణరావు శనివారం రాత్రి కాలనీలోని ఒక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చెట్టుకు వేలాడుతున్న లక్ష్మణరావును ఆదివారం ఉదయం 7.30 గంటల సమయంలో కాలనీవాసులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలిసిన విజయలక్ష్మి వెంటనే అక్కడికి చేరుకుని.. ఆత్మహత్య చేసుకున్న భర్తను చూసి విలపించింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ప్రధాన బుకీ అరెస్ట్

జగదాంబ: ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలపై నగర పోలీసులు ఉక్కుపాదం మోపారు. అమాయకులను తప్పుదోవ పట్టించి బెట్టింగ్‌లకు పురికొల్పుతున్న ప్రధాన బుకీ బొంద గోపితో సహా ఇద్దరిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన ఈ నిందితులను సాంకేతిక నిఘాతో పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ ఆపరేషన్‌లో ప్రధాన నిందితుడు బొంద గోపి 20 బ్యాంకు ఖాతాలను కలిగి ఉన్నట్లు గుర్తించారు. అతను క్రికెట్ బ్రహ్మ, గోపీ క్రికెట్ అనలిస్ట్, క్లాసిక్ ప్రిడిక్షన్, విన్నర్ ఐపీఎల్, బోల్డ్ ప్రిడిక్షన్, జెనీ ప్రిడిక్షన్ అనే ఆరు టెలిగ్రామ్ చానల్ల ద్వారా క్రికెట్ బెట్టింగ్‌ను ప్రచారం చేస్తున్నాడు. తన వద్ద పనిచేసే వారి ద్వారా బెట్టింగ్ ఆడాలనుకునే వారి నుంచి డబ్బులు సేకరించి, లాగిన్‌లు ఇచ్చి బెట్టింగ్‌లు వేయిస్తున్నాడు. గోపి టెలిగ్రామ్ చానల్‌కు సుమారు 10,000 మంది ఫాలోవర్లు ఉండగా, వారిలో నిత్యం 300 నుంచి 500 మంది ఒక మ్యాచ్‌పై బెట్టింగ్ ఆడుతున్నారని పోలీసులు వెల్లడించారు. వీరు కాల్ సెంటర్ తరహాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఆధారాలు లభించాయి. ఈ అరెస్టుతో మరికొంత మంది బెట్టింగ్ బుకీలు, జూదగాళ్ల వివరాలు బయటపడినట్లు పోలీసులు తెలిపారు. వారిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని స్పష్టం చేశారు.

నటనతో పాటు చదువులోనూ రాణించాలి


అరుణ్ దేవ్‌ను అభినందిస్తున్న గణబాబు

గోపాలపట్నం: '35 చిన్న కథ కాదు'లో అద్భుత నటనకు గానూ తెలంగాణ ప్రభుత్వం నుంచి 'గద్దర్' ఉత్తమ బాల నటుడు అవార్డు అందుకున్న అరుణ్ దేవ్‌ను ప్రభుత్వ విప్ గణబాబు అభినందించారు. పెందుర్తి మండలం నాయుడుతోటకు చెందిన అరుణ్ దేవ్ తన మొదటి సినిమాతోనే అవార్డు అందుకునే స్థాయికి ఎదగడం గొప్ప విషయమని గణబాబు పేర్కొన్నారు. ఆదివారం విప్ కార్యాలయంలో అరుణ్ దేవ్ తన కుటుంబ సభ్యులతో కలిసి గణబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు అరుణ్ దేవ్‌ను గణబాబు సత్కరించారు. మన ప్రాంతానికి చెందిన బాలుడికి అవార్డు రావడం గర్వకారణమన్నారు. నటనతో పాటు చదువులో కూడా అరుణ్ దేవ్ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గోపాలపట్నం కళాసేవా పీఠం సభ్యులు నందవరపు సోములు, చందు సుబ్బారావు, గొరపల్లి బంగ్రరాజు, నూక రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీనగర్‌లో డయేరియా విజృంభణ

పీఎంపాలెం: గాయత్రీనగర్‌లోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో డయేరియా కేసులు పెరుగుతున్నాయి. శనివారం నాటికి 22 కేసులు నమోదవగా.. ఆదివారం మరో కేసు నమోదై.. మొత్తం సంఖ్య 23కు చేరిందని పీఎంపాలెం యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి సుజాన్ పల్లా తెలిపారు. ప్రస్తుతం ఇద్దరు బాధితులు వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా.. మిగిలిన వారికి కాలనీలోని వారి ఇళ్ల వద్దనే అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నామని వెల్లడించారు. డీఎంహెచ్‌వో డి.జగదీశ్వరరావు, ఏఎంహెచ్‌వో కిశోర్ శిబిరాన్ని పరిశీలించి వైద్య సిబ్బందికి తగిన సూచనలిచ్చారు.

పాలిసెట్ వెబ్ ఆప్షన్ల మార్పిడి గడువు పొడిగింపు

మురళీనగర్: పాలిసెట్ చివరి దశ కౌన్సెలింగ్ గడువు సోమవారంతో ముగుస్తుంది. వాస్తవానికి ఈ నెల 18న ప్రారంభమైన ఆప్షన్ల మార్పిడి ఆదివారంతో ముగిసినప్పటికీ, గడువును సోమవారానికి పొడిగించారు. అభ్యర్థులు వెబ్ ఆప్షన్ల ఎంపిక, మార్పిడిని సోమవారం సాయంత్రంలోగా చేసుకోవాల్సి ఉంటుంది. వీరికి ఈ నెల 23న సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఆన్‌లైన్ రిపోర్టింగ్ ఈ నెల 24 నుంచి 27 వరకు ఉంటుంది. పాలిసెట్ రెండో దశలో 160 మంది మాత్రమే నమోదు చేసుకోగా, మొదటి కౌన్సెలింగ్‌లో 2,040 మంది నమోదు చేసుకున్నారు.

ఈసెట్ కౌన్సెలింగ్ : ఈసెట్ రెండో దశ కౌన్సెలింగ్ ఈ నెల 18న ప్రారంభమైంది. వెబ్ ఆప్షన్ల మార్పిడి సోమవారంతో ముగుస్తుంది. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహించిన మొదటి దశ ఈసెట్ కౌన్సెలింగ్‌లో 1400 మంది, రెండో దశలో 135 మంది ఆదాయ ధ్రువపత్రాలు, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నారు. వీరి కౌన్సెలింగ్ సోమవారంతో ముగుస్తుంది. ఈసెట్‌లో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి జూలై 22న సీట్లు కేటాయిస్తారు. ఆన్‌లైన్ సెల్ఫ్ జాయినింగ్ జూలై 23 నుంచి 25వ తేదీలోగా ఆయా కాలేజీలకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ పర్యవేక్షణలో సిస్టమ్ అడ్మిన్ ఎస్.నాగరాజు కౌన్సెలింగ్‌కు సహకరించారు.


పాలిసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు